## సమాచారం

### 4న వీధి కుక్కలకు వ్యాక్సినేషన్

మణికొండ: మున్సిపాలిటీ, అలకాపూర్ టౌన్‌షిప్ పరిధిలోని స్వామి వివేకానంద పార్కులో ఫిబ్రవరి 4వ తేదీ ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు వీధి కుక్కలతో పాటు పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేస్తారని మణికొండ మున్సిపల్ కమిషనర్ ఫల్గుణ్ కుమార్ తెలిపారు. బ్లూ క్రాస్ సొసైటీ వారు రేబిస్ వ్యాక్సిన్ వేయటంతో పాటు వీధి కుక్కలను దత్తత తీసుకుంటారని తెలిపారు.

### నకిలీ పొదుపు సంఘాలపై కలెక్టర్‌కు అధికారుల నివేదిక

శంషాబాద్: పొదుపు సంఘాల మహిళల ప్రమేయం లేకుండా ఓ రిసోర్స్ పర్సన్ నకిలీ వ్యక్తులు, ఫోర్జరీ సంతకాలతో స్వాహా చేసిన రుణాలపై డీఆర్‌డీఓ ఉన్నతాధికారులు జిల్లా కలెక్టర్‌కు నివేదించినట్లు సమాచారం. దీనిపై జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించిన వెంటనే దర్యాప్తు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

### సన్మానం


ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబును సన్మానిస్తున్న బత్తిని లింగంగౌడ్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబును రాష్ట్ర బీసీ సేన ఉపాధ్యక్షుడు బత్తిని లింగంగౌడ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్‌కు పూలబొకే అందజేసి సన్మానించారు.

### సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు పంపిణీ


కవితకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ రూరల్: మండలంలోని నర్కూడకు చెందిన జి.కవితకు మంగళవారం ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ రూ.60వేల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఎన్.శేఖర్, డీసీసీబీ డైరెక్టర్ బి.సతీష్, అమ్మపల్లి దేవాలయం కమిటీ సభ్యులు శ్రీనివాస్, లావణ్యవిశ్వనాథం, నీరటి అశోక్, బీఆర్‌ఎస్ నాయకులు నర్సింహగౌడ్, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

రాయదుర్గం: లక్ష్మణ్‌భాగ్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రాయదుర్గంలోని పురాతన ఆలయాల్లో ఇది ఒకటి. బ్రహ్మోత్సవాలలో భాగంగా 3వ తేదీన ఆలయంలో కల్యాణం, 5వ తేదీన ఆలయ ప్రాంగణంలో రథోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

### నిరుపేద యువతులకు ఉచిత శిక్షణ

సాక్షి, సిటీబ్యూరో: నిరుపేదలు, ప్రధానంగా యువతులకు నైపుణ్య శిక్షణ, ఆర్థిక అక్షరాస్యత లక్ష్యంగా నగరానికి చెందిన ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ సింక్రోనీ యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్, ఎన్‌జీఓ నిర్మాణ్ సంస్థలు చేతులు కలిపాయి. 'ఎడ్యుకేషన్ యాజ్ ఏ ఈక్వలైజర్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి ఈ విషయాన్ని నిర్వాహక సంస్థల ప్రతినిధులు తెలిపారు. శిక్షణ –ఉపాధి కల్పన, ఉపకారవేతనాల మంజూరు అనే 2 రకాల సేవలు ఈ కార్యక్రమం ద్వారా అందిస్తున్నామని ఈ ప్రాజెక్ట్ కింద ఫతేనగర్ పరిసర బస్తీలకు చెందిన 45 మంది యువతులు ఐటీ అనుబంధ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకోగా, 28మందికి ఎమ్ఎన్‌సిలలో ఉపాధి లభించిందన్నారు. మరో ఏడుగురికి ఉపకారవేతనాలు అందించామన్నారు.

### రెండు కార్లు ఢీ

రాజేంద్రనగర్: రోడ్డు ప్రమాదంలో రెండు కార్లు ఢీకొన్న సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మౌనిక తెలిపిన వివరాల ప్రకారం రాజేంద్రనగర్‌లోని వర్సిటీ ప్రధాన ద్వారం వద్ద రెండు కార్లు ప్రమాదానికి గురయ్యాయి. ఈ సంఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదన్నారు. శంషాబాద్ నుంచి ఆరాంఘర్ వైపు మంగళవారం ఉదయం వెళ్తున్న రెండు కార్లు అదుపుతప్పి డివైడర్‌పై ఉన్న పూలకుండీలను ఢీకొట్టాయి.

### అక్రమంగా పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు

మాదాపూర్: అక్రమ పార్కింగ్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మాదాపూర్ ట్రాఫిక్ సీఐ నర్సయ్య అన్నారు. మాదాపూర్‌లోని ప్రధాన రహదారుల పక్కన పనికి రాని వాహనాలు, అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలను మంగళవారం తొలగించారు. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలపడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందన్నారు.

# ఫ్లైఓవర్ పొడిగించాల్సిందే...

## ఓవైపు రిలే దీక్షలు.. మరోవైపు పనుల అడ్డగింత


ప్యారడైజ్ వద్ద ఫ్లైఓవర్ పనులు నిలిపివేయిస్తున్న శంషాబాద్ జేఏసీ నేతలు


రిలే దీక్షలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ

శంషాబాద్ : సింప్లెక్స్ వరకు ఫ్లైఓవర్‌ను పొడిగించే వరకు ఉద్యమం ఆపేది లేదని శంషాబాద్ జేఏసీ నేతలు స్పష్టం చేశారు. అవసరమైతే ప్రతి ఇంటి నుంచి వచ్చి జాతీయరహదారిపై బైఠాయిస్తామని హెచ్చరించారు. మంగళవారం ప్యారడైజ్ వద్ద జరుగుతున్న ఫ్లైఓవర్ పనులను జేఏసీ నేతలు అడ్డగించారు. అంతకుముందు సిద్ధంతి ముదిరాజ్ భవన్ ముందు బ్రిడ్జి బడావో.. శంషాబాద్ బచావో నినాదంతో రిలేదీక్షలు ప్రారంభించారు. ముందుగా నిర్ణయించిన అలైన్‌మెంట్ కాకుండా ఫ్లైఓవర్‌ను సిద్ధంతి వరకు మాత్రమే ఏర్పాటు చేయడంతో శంషాబాద్ ప్రజలు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ అన్నారు. ఫ్లైఓవర్ నిర్మాణంలో ఎన్‌హెచ్ఏ అధికారులు తీరు సరిగ్గా లేదని మండిపడ్డారు. గమ్యం చేరేంతవరకు పోరాడుదామని వైస్ చైర్మన్ బండిగోపాల్ యాదవ్ అన్నారు. శంషాబాద్‌లోని రెండు బస్తీల అనుసంధానం లేకుండా చేయడంతో పాటు ప్రజల జీవనాధారాన్ని కూడా దెబ్బతీసేలా ఫ్లైఓవర్ నిర్మాణం జరుగుతోందని మాజీ సర్పంచ్‌లు ఆర్. గణేష్‌గుప్తా, రాచమల్ల సిద్దేశ్వలు అన్నారు. సిద్ధంతి వద్ద ఫ్లైఓవర్ ఆగిపోతే ట్రాఫిక్ రద్దీ పెరిగి ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతుందన్నారు. ఫ్లైఓవర్ అలైన్‌మెంట్ మార్చితేనే పనులు సాగనిస్తామని నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ డి.వెంకటేష్‌గౌడ్ అన్నారు.

**ఉన్నతాధికారుల దృష్టికి ..**

ప్రజల డిమాండ్‌ను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని ఆర్అండ్‌బీ ఈఈ ధర్మారెడ్డి తెలిపారు. ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ భాస్కర్, సీఐ శ్రీనివాస్‌తో పాటు శంషాబాద్ జేఏసీ నేతలు చర్చలు జరిపారు. సిద్ధంతి ఉన్న రెండు ప్రార్థనా మందిరాల తొలగింపుతోనే పాత అలైన్‌మెంట్ సాధ్యపడుతుందని ఈఈ అన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాలని జేఏసీ నేతలు తెలిపారు. గురువారం ఉన్నతాధికారుల బృందం శంషాబాద్‌కు వస్తుందని వారితో చర్చించిన అనంతరం నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మేకల వెంకటేష్ ముదిరాజ్, కౌన్సిలర్లు అజయ్, అమృత, భారతమ్మ, కాంగ్రెస్ నాయకులు శేఖర్, నందరాజ్‌గౌడ్ తదితరులున్నారు.

## చిరుధాన్యాల సాగుపై దృష్టి పెట్టాలి


హమీదుల్లానగర్‌లో చిరుధాన్యాలపై రైతులకు శిక్షణ ఇస్తున్న వ్యవసాయాధికారులు

శంషాబాద్ రూరల్: చిరు ధాన్యాల సాగుపై రైతులు దృష్టి పెట్టాలని వ్యవసాయశాఖ ఏడీ లీనా రెడ్డి సూచించారు. జాతీయ ఆహార భద్రత మిషన్‌లో భాగంగా చిరుధాన్యాల సంవత్సరం పురస్కరించుకుని వీటి సాగుపై మండలంలోని రైతులకు శిక్షణ ఏర్పాటు చేశారు. హమీదుల్లానగర్, మల్కారంలో ఉన్న రైతు వేదికలపై మంగళవారం రైతులకు చిరుధాన్యాల ప్రాధాన్యతను వివరించారు. ఎన్నో పోషక విలువలు ఉన్నాయని, ఆరోగ్య సిరులైన చిరుధాన్యాలను రైతులు సాగు చేసుకోవాలన్నారు. కొర్రలు, అండుకొర్రలు, ఊదలు, సామల్లో ఔషధ గుణాలు ఉన్నాయని ఏఓ కవిత అన్నారు. కార్యక్రమంలో ఏఈఓ రాఘవేందర్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

## ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఏర్పాటు


మణికొండలో సమావేశమైన ఫొటోగ్రాఫర్‌లు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్‌లు నూతన అసోసియేషన్‌గా ఏర్పడ్డారు. మంగళవారం మణికొండ శివాలయం ఆవరణలో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా రాజు, ఉపాధ్యక్షుడిగా విజయభాస్కర్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్, కె.నరేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ కె.రామకృష్ణారెడ్డిలు పాల్గొన్నారు. జ్ఞాపకాలను మధురంగా కలకాలం ఉంచేది ఫొటోగ్రాఫర్‌లేనని, సంఘటితంగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

## కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి


అలకాపూర్‌లో కంటివెలుగును ప్రారంభించి పరిశీలిస్తున్న నరేందర్‌రెడ్డి


కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

**మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి**

మణికొండ: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో అలకాపూర్ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని కౌన్సిలర్ శ్రీకాంత్‌స్వామితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం తీసుకుంటున్న ఆహారంలో సమతుల్యత లేకపోవటంతో పలు కంటి సమస్యలు వస్తున్నాయన్నారు. ఎప్పటికప్పుడు పరీక్షలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ మల్లారెడ్డి, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు సి.వీరప్ప, డాక్టర్‌లు అంకిత, ఎక్బాల్, ఏఎన్‌ఎంలు రేణుక, విజయలక్ష్మి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

**తగు జాగ్రత్తలు తీసుకోవాలి..**

మైలార్‌దేవ్‌పల్లి: అందరూ కళ్లపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని రాజేంద్రనగర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక అన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ స్థానిక కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరంలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు పద్మ, భాగ్యలక్ష్మి, జర్సీ, ఆశవర్కర్లు పద్మ, సరిత, మానస, సువర్ణ, నవ్య, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

## సీఐటీయూ ముందుండి పోరాడుతుంది

రాజేంద్రనగర్: కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ ముందుండి పోరాడుతుందని కాటేదాన్ క్లస్టర్ కన్వీనర్ రుద్రకుమార్ అన్నారు. టార్బెడ్ మెటల్ ఇండస్ట్రీలో 12 ఏళ్లుగా పని చేస్తున్న మహ్మద్‌ను విధుల్లో నుంచి బహిష్కరించగా, మంగళవారం సీఐటీయూ నాయకులను ఆశ్రయించాడు. ఈ సందర్భంగా వారు యాజమాన్యంతో చర్చించి కార్మికుడికి రావాల్సిన రూ. 55 వేలు అందేలా చూశారు.

## వైభవంగా ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన



రాయదుర్గం: భక్తుల జయజయధ్వానాలు...అర్చకుల మంత్రోచ్చారణల మధ్య గోపన్‌పల్లిలో ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా సాగింది. గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లిలో నూతనంగా ఎల్లమ్మతల్లి ఆలయ నిర్మాణం చేశారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో గోపన్‌పల్లి, పరిసరగ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి బోనం సమర్పించారు. గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి దంపతుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలకు ప్రతీకలు మన వన దేవతల పర్వదినాలన్నారు. అనంతరం అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రవి కుమార్‌యాదవ్, కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రవీంద్ర ప్రసాద్ దూబే తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు కష్టపడి చదవాలి


విద్యార్థిని ఆర్తిని అభినందిస్తున్న ఏసీపీ గంగాధర్

రాజేంద్రనగర్: విద్యార్థులు కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాలను సాధించడం సులభమని రాజేంద్రనగర్ ఏసీపీ గంగాధర్ అన్నారు. రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన విద్యార్థిని ఆర్తి పాలెంలోని కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్‌లో అడ్మిషన్ పొందింది. ఈ సందర్భంగా ఆర్తిని కళాశాల ప్రిన్సిపల్ ఎర్ర అంజయ్య, ఏసీపీ గంగాధర్ అభినందించారు. ప్రణాళికాబద్ధంగా చదివితే ఏదైనా సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో మాన్య, కిరణ్‌కుమార్, పరశురాములు, చంద్రశేఖర్, కృష్ణారెడ్డి, స్వప్న, సమీన, సాయిప్రసన్న, శ్రీజన్య, శశిధర్, భరత్, నర్సింగ్, గణేష్, కరుణాకర్, కిషన్, కుమార్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌సీయూలో ఏబీవీపీ నిరసన


డిమాండ్లు పరిష్కరించాలంటూ నిరసనకు దిగిన ఏబీవీపీ నాయకులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో నిరసనకు దిగారు. హెచ్‌సీయూ క్యాంపస్‌లోని పరిపాలనా భవనం ముందు మంగళవారం ఏబీవీపీ హెచ్‌సీయూ శాఖ అధ్యక్షురాలు నమ్రతాసింగ్ ఆధ్వర్యంలో పలువురు ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేశారు.ఈ సందర్భంగా నమ్రతా సింగ్ మాట్లాడుతూ హెచ్‌సీయూ విద్యార్థులకు లంచ్‌లో రోటీలు అందించాలని, ఎఫ్, జీ మెస్‌లో కుకింగ్ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. క్యాంపస్‌లోని లేడీస్ హాస్టళ్లలో శానిటరీ న్యాప్కిన్స్ డిస్పోజబుల్ మిషన్లు ఏర్పాటు చేయాలని, గోప్స్, నార్త్ ఎల్‌హెచ్, వివేకానంద అమెనిటీస్ సెంటర్‌లలో క్యాంటీన్‌లను ప్రారంభించాలన్నారు.హెల్త్ సెంటర్‌లో 24 గంటల పాటు డాక్టర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు శ్రావణ బాలా, ప్రణవ్, సాక్షి, సందీప్, నేహ, మానసి, సిద్ధాంత శ్రీకుట్టి, ఫణీంద్ర, అక్షయ్, సంగమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం


మణికొండ ఎంప్లాయిస్ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించిన కౌన్సిలర్, కమిషనర్

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ 16వ వార్డు ఎంప్లాయిస్ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం కౌన్సిలర్ పి. శైలజ వినోద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కె.ఫల్గుణ్‌కుమార్, కౌన్సిలర్‌లు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునీకరించే క్రమంలో లయన్స్‌క్లబ్ వారు ముందుకు రావటంతో వారి సహకారంతో ఎంప్లాయిస్ కాలనీలో పనులను చేపట్టామన్నారు. కార్యక్రమంలో 14వ వార్డు కౌన్సిలర్ యాలాల లావణ్యనరేష్, లయన్స్ క్లబ్ ప్రతినిధి వినయ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మీ పాత్రే కీలకం

**పారిశుధ్య కార్మికులకు పీపీ కిట్లు పంపిణీ చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్**


కిట్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ గోపాల్ యాదవ్

శంషాబాద్: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పారిశుధ్య కార్మికుల పాత్రే కీలకం అని శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ అన్నారు. పారిశుధ్య నిర్వహణలో పాలుపంచుకుంటున్న కార్మికులు ఆరోగ్యంగా ఉండాలన్నారు. వారికి మంగళవారం సబ్బులు, నూనెలు ప్రొటెక్టివ్ కిట్ అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో జూన్ నుంచి 9వ తరగతికి నూతన పాఠ్యపుస్తకం

**తెలుగు పాఠ్యపుస్తక సమన్వయకర్త, రచయిత డాక్టర్ టీపీఎస్.రమేష్**

రాయదుర్గం: ఆంధ్రప్రదేశ్‌లో 2023 జూన్ నుంచి 9వ తరగతికి నూతన పాఠ్యపుస్తకాన్ని విద్యార్థులకు అందించే ప్రయత్నం చేస్తున్నామని తెలుగు పాఠ్యపుస్తక సమన్వయకర్త, రచయిత డాక్టర్ టీపీఎస్ రమేష్ అన్నారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఏపీలో ఎస్‌సీఈఆర్‌టీ (ఎస్‌ఈఆర్‌టీ) ద్వారా రూపకల్పన చేస్తున్న 9వ తరగతి పాఠ్యపుస్తకానికి సంపాదకులుగా వ్యవహరిస్తున్న హెచ్‌సీయూ తెలుగు శాఖాధిపతి ఆచార్య దార్ల వెంకటేశ్వరరావును మంగళవారం మర్యాద పూర్వకరంగా కలిశారు. అనంతరం నూతనంగా రూపొందించిన పుస్తకాన్ని ఆయనకు అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్దేశానుసారం, మానవీయ విలువలకు సాహితీ విలువల మేళవింపుగా ఈ పాఠ్యపుస్తకాన్ని రూపొందిస్తున్నామన్నారు. కొత్త పాఠ్యపుస్తకాన్ని పరిశీలించడానికి ఆచార్య దార్ల వెంకటేశ్వరరావుకు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పుస్తకాన్ని పరిశీలించిన ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉత్తమాభిరుచికి ఉన్నతాశయానికి ఈ నూతన పుస్తకం దిక్సూచిగా ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పుస్తకం రచయితల బృందం ప్రతినిధి డాక్టర్ వూటుకూరి వరప్రసాద్ పాల్గొన్నారు.

## టెక్నాలజీ జీవితాలను ప్రభావితం చేస్తుంది


సుధీ-2023ని ప్రారంభించిన అతిథులు

మణికొండ: టెక్నాలజీ కమ్యూనికేషన్, రవాణా, ఆరోగ్య సంరక్షణ, కనెక్టివిటీ వరకు మన జీవితాలను ప్రభావితం చేస్తుందని ఎల్‌టీఐ మైండ్ ట్రీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ కృష్ణ గొల్లపూడి అన్నారు. గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ( సీబీఐటీ)కళాశాలలో మంగళవారం జరిగిన సాంకేతిక వార్షిక ఈవెంట్ సుధి-2023కి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికత మన జీవితాన్ని ఏదో రూపంలో ప్రభావితం చేస్తుందని, అది లేకుండా జీవితం అసాధ్యం అనే స్థాయికి వచ్చిందన్నారు. కాగ్నిజెంట్ సీనియర్ డైరెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ పోటీ యుగంలో ప్రతి విద్యార్థి క్రిటికల్ థింకింగ్, సమస్య పరిష్కారంలో నేర్పరి కావాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవీందర్‌రెడ్డి కళాశాల పురోగతిని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పేపర్ పోస్టర్ ప్రజెంటేషన్, లాన్ గేమింగ్, క్విజ్‌లాంటి సాంకేతిక ఈవెంట్‌లలో పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

# నాణ్యమైన విద్యకు నవోదయం

- ఆరవతరగతిలో ప్రవేశానికి అర్హత పరీక్ష
- వివరాలు వెల్లడించిన జేఎన్‌వీ రంగారెడ్డి జిల్లా ప్రిన్సిపల్ డానియల్ రత్నకుమార్




శేరిలింగంపల్లి గోపన్‌పల్లిలోని జవహర్‌నవోదయ విద్యాలయ ప్రధాన భవనం

రాయదుర్గం: నాణ్యమైన విద్యకు నవోదయ చిరునామా. జేఎన్‌వీలోని ఆరవ తరగతిలో ప్రవేశం కోసం దేశవ్యాప్తంగా ఒకేరోజు ఒకే ప్రశ్నపత్నంతో పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జేఎన్‌వీ రంగారెడ్డిజిల్లా ప్రిన్సిపల్ డానియల్ రత్నకుమార్ సాక్షితో ప్రత్యేకంగా మాట్లాడారు. ఉమ్మడి రంగారెడ్డిజిల్లా పరిధిలో ప్రస్తుతం ఐదవ తరగతి చదివే విద్యార్థులు అర్హులు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

**ప్రశ్న:** ఇప్పటి వరకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి వచ్చిన దరఖాస్తులు ఎన్ని ?

**ప్రిన్సిపాల్ :** జేఎన్‌వీ రంగారెడ్డిజిల్లా ఆరవ తరగతిలో ప్రవేశానికి ఐదవ తరగతి చదవుతున్న విద్యార్థులు అర్హులు. రంగారెడ్డి జిల్లా నుంచి 1,492 మంది, మేడ్చల్‌జిల్లా నుంచి 962, వికారాబాద్ జిల్లా నుంచి 778 మంది ఇప్పటి వరకు దరఖాస్తు చేశారు. ఫిబ్రవరి 8వ తేదీ వరకు గడువు ఉన్న నేపథ్యంలో మరిన్ని దరఖాస్తులు వచ్చే అవకాశముంది.

**ప్రశ్న:** ఆరవ తరగతిలో ప్రవేశం తర్వాత ?

**ప్రిన్సిపాల్ :** జేఎన్‌వీ రంగారెడ్డిజిల్లాలో ఆరవ తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థులకు 12వ తరగతి వరకు అత్యాధునిక సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందిస్తాం. హాస్టల్ వసతితోపాటు ఉచితంగా పుస్తకాలు, డ్రెస్‌లు కూడా అందజేస్తాం.

**ప్రశ్న:** చదువుతోపాటు ఇతర అంశాలపై ఎలాంటి ప్రోత్సాహం ఉంటుంది?

**ప్రిన్సిపాల్ :** జేఎన్‌వీ రంగారెడ్డిజిల్లాలో చదువుతో పాటు విద్యార్థులకు ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, స్కౌట్స్ అండ్ గైడ్స్, అన్ని రకాల క్రీడలు, ఆర్ట్స్, మ్యూజిక్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తాం.

**ప్రశ్న:** విద్యార్థులకు ఉన్నత విద్య కోసం ఎలాంటి శిక్షణ అందిస్తారు ?

**ప్రిన్సిపాల్ :** 9వ తరగలి నుంచే నీట్, జేఈఈలపై ఆన్‌లైన్‌లో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తాం. విజ్ఞానజ్యోతి పథకం కింద 11,12 తరగతి విద్యార్థులకు సైన్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టేలా ప్రోత్సాహం అందిస్తాం. అదనంగా ఉపకారవేతనాలు కూడా అందిస్తారు.